# కర్తవ్యం

వాలి హిరణ్మయీదేవి

హాస్పిటల్‌లోని 'క్యూ'ని చూస్తూనే అదిరిపడింది సుష్మ. 'తనవంతు వచ్చేసరికి ఏ పదకొండో-పన్నెండో అయ్యేటట్లుంది. బస్ అంది వెళ్ళేసరికి ఎంత లేదన్నా ఒంటిగంటవుతుందో ఏంటో' అనుకుంది.

"ఇవాళగూడా పర్మిషన్ తీసుకొన్నావా మమ్మీ" అడిగింది సంధ్య.

"తీసుకొన్నా - పన్నెండుకల్లా ఆఫీసులో వుంటానని చెప్పాను. అసలే బోలెడంత పని వుంది" అంది దిగులుగా సుష్మ.

సంధ్యకన్నీ 'డబుల్'గా కన్పిస్తున్నాయంటే 'సాధురాం హాస్పిటల్'కి తీసుకెళ్ళింది సుష్మ. రెండు రోజులు ఏవో పరీక్షలు చేసి 'నరాల [illegible]లెప్పింగ్ సరిగ్గా లేదు. న్యూరాలజిస్ట్‌కి చూపించండి" అంటే ఉస్మానియాకు తీసుకెళ్ళింది. అతను రెండ్రోజులు ఏవో టెస్ట్‌లు చేసి 'సరోజిని కంటి హాస్పిటల్‌లో మరికొన్ని పరీక్షలు చేయించి తీసుకురండంటే - అక్కడికి నాలుగైదుసార్లు వెళ్ళాల్సివచ్చింది. ఇవాళ రిపోర్ట్ ఇస్తే పట్టుకెళ్ళి ఉస్మానియాలో చూపించవచ్చునుకొంటూ వచ్చింది.




సుష్మ భర్త ఎనిమిదింటికల్లా ఫ్యాక్టరీకి వెళ్ళాల్సివుంటుంది. అందుకే "నాకు కుదరదు-నువ్వే తీసుకెళ్ళు" అంటూ ఆయా హాస్పిటల్స్ దగ్గర వీలైనప్పుడు దింపి వెడుతున్నాడు. తిరుగు ప్రయాణానికి మళ్ళీ ఆటోలు-బస్‌లు తప్పడంలేదు. మొత్తానికి ఈ పదిహేను రోజులుగా సుష్మకి హాస్పిటల్స్ చుట్టూ 'చెక్కర్లు' అధికమయ్యాయి. ఎటొచ్చీ 'ఎంత ఆలస్యంగా వచ్చినా - పని చకచక చేస్తుంది. పెండింగ్‌లో

వర్క్ ఉంచదు' అన్న నమ్మకంలో వుంది కాబట్టి ఆమె కోరినప్పుడల్లా పర్మిషన్లు ఇస్తున్నాడామె బాస్.

"ఇది నరాలకు సంబంధించిన జబ్బు కాదు. స్క్వింట్ (మెల్లకన్ను) వల్ల అన్నీ డబుల్‌గా కనిపిస్తున్నాయి. లెఫ్ట్ ఐ వీక్‌గా వుంది కాబట్టి బాలెన్స్ కుదుర్తుంది అలా నెలపాటు చేసి మళ్ళీ తీసుకురండి" అని చెప్పారు డాక్టర్లు రిపోర్ట్సు అన్నీ చూసి.

ఈ ఒక్క ముక్క వినడానికెంత శ్రమ పడవలసి వచ్చిందనుకొంటూ నిట్టూర్చి ఇంటి మొహం పట్టింది సుష్మ సంధ్యతోపాటు.

సంధ్యనింట్లో వదిలి, టిఫిన్ బాక్స్‌లో ఇంతన్నం పెట్టుకొని పెరుగుని బాటిల్‌లో వేసుకొని బైటపడింది సుష్మ.

పావుగంట నిలబడితేగాని ఆటో దొరకలేదు. తొందరగా ఆటో ఎక్కేసిన సుష్మ–మధ్యలో ఎందుకో మీటర్ వంక చూసి అదిరిపడింది,' అప్పుడే అది ఐదు రూపాయిలు చూపిస్తుండడంతో.

"ఏంటీ మీటర్ సరిగ్గా వెయ్యలేదా?" అడిగింది ఆటో అతణ్ణి.

"సరింగనె ఏసిన. చూడలే?" అన్నాడు 'సహజమైన' పొగరు నిండిన కంఠంతో.

ఒళ్ళు మండింది సుష్మకి.

"మా ఆఫీస్ దగ్గరికెడితేగాని ఐదు రూపాయలవదు. ఈలెక్కన చూస్తే ఎనిమిది, తొమ్మిది రూపాయలయ్యేటట్లుంది–ఛ–దోచుకుతినడం ఎక్కువైంది" అంది చిరాగ్గా.

"ఏందమ్మో. ఎక్కువ తక్వ మాట్లాడకు. ఈడనే దిగు అట్లయితే. ఐదు పైసలడిగితె చెప్ప తీస్కకొట్టు" అన్నాడు ఆటోనాపుచేస్తూ.

"అసలే టైమై నేనేదుస్తుంటే–ఇలా మధ్యలో ఆపి దిగమంటే ఎలా? ఎంతెంత వేస్ట్ కావడం లేదు. అందులో ఇదొకటి–కొంచెమయినా మీకుండాలి "నియ్యత్" (సిన్సియారిటీ/ నిజాయితి) అంతే" అంది ఆవేశంగా.

"ఏంది – నా నియ్యత్ నెంచుతున్నవ్? మేం నియ్యత్‌గనె ఆటో చెలాయిస్తున్నం. మీ సర్కార్ కొల్వులోళ్ళే బెయిమానోళ్ళు. మీ నియ్యత్ మాకు బాగ ఎరికలే" అన్నాడు గీరగా.

గమ్యం చేయడంతో వాడితో వాదనలనవసరం అనుకొంటూ ఆఫీసులో అడుగు పెట్టింది సుష్మ.

xx

ఆ రాత్రి పక్కమీద వాలాక, ఆటో వాడి మాటలు గుర్తొచ్చాయ్ సుష్మకి. దాంతో ఒక్కసారి తరచి చూసుకొంది. కొలీగ్స్ తాము ఆరోజు బస్‌లో ఎదుర్కొన్న ఇన్సిడెంట్స్ చెప్పకొంటూ అర గంట వేస్ట్ చేస్తారు. ఈలోగా టీలొస్తాయ్. దాంతో మరో అరగంట. ఒక గంట మనసు పెట్టి పనిచేస్తారో లేదో లంచ్ టైం.

కొందరు లంచ్‌కి రెండు గంటలు తీసుకుంటే మరికొందరు గంట–గంటన్నర తీసు కొంటారు. తనలాంటి వాళ్ళు తర్వాత రెండు గంటలపాటు పనిచేస్తే మరికొందరు చేసినట్లు నటిస్తారంతే. పావుదక్కువైదుకే ఫైళ్ళు కట్టేస్తారు. అంటే తాము పనిచేసేదెంత? క్రికెట్ లేక మరోటో ఉంటే ఆ మాత్రం చేయరు. జీతానికి తగ్గ పని చేయని తాము, ఇంకొకరి 'నియ్యత్'ని గురించి ప్రశ్నించడమెంత హాస్యాస్పదం. రెండు రూపాయిలు వాడు ఎక్కువ తీసుకుంటే తన కడుపు రగులుకుపోయింది. మరి తమలాంటి ఉద్యోగులు ఈ సంఘానికి కలిగించే నష్టాన్ని ఎవరు బేరీజు వేస్తారు? అనుకోగానే సిగ్గేసింది సుష్మకి.

మన దేశంలోని ప్రతి ఒక్కరు రోజుకి సిన్సియర్‌గా నాలుగు గంటలపాటు పనిచేస్తే ఎంతో అభివృద్ధిని సాధించగలమని – చదివింది – నిజం చేయొచ్చు.

రేపటి నుంచి నేను నా శాయశక్తులా సిన్సియర్‌గా పనిచేస్తూ – హస్కుతో కాలం గడిపే నా కొలీగ్స్ చేత గూడా పనిచేయిస్తాను. అదే నా దేశానికి నేను ఉడుతా భక్తిగా చేసే సహాయం. కాదు కాదు నేను నిర్వర్తించే నా కర్తవ్యం' అనుకొంది సుష్మ. ఈ నిర్ణయం తీసుకొన్నాక హాయిగా నిద్రపట్టిందామెకి. ■


